క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



మృతురాలి కుటుంబ సభ్యులకు నగదును అందిస్తున్న నేతలు

కేశంపేట: మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో మంగళవారం అనారోగ్యంతో గన్నోజు అచ్చమ్మ మృతి చెందారు. మృతురాలిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణగౌడ్ రూ.5వేలు, గ్రామ మాజీ సర్పంచ్ సావిత్రిబాలరాజ్‌గౌడ్ రూ.3వేలు, రాంరెడ్డి 2వేలు, యాదయ్య వెయ్యి రూపాయల చొప్పున ఆర్థికసాయాన్ని అందించారు.

'పట్నం' దంపతులకు శుభాకాంక్షలు



'పట్నం' దంపతులను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నాయకులు

చేవెళ్ల: ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డిలను కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నాయకులు మంగళవారం కలిశారు. నగరంలోని మహేందర్‌రెడ్డి నివాసానికి చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీం భరత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, వీరేందర్‌రెడ్డి, పాండుయాదవ్, పెంటయ్యగౌడ్ ఉన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ను

వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిని కాంగ్రెస్ నాయకులు కలిసి స్వాగతం తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఆగిరెడ్డి, మధుసుధన్‌గుప్తా, వెంకట్‌రెడ్డిలు ఉన్నారు.

శ్మశానవాటిక పనులు ప్రారంభం



శ్మశాన వాటికలో నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

వికారాబాద్ అర్బన్: హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధి ధన్నారంలోని శ్మశాన వాటికలో రూ.25 లక్షలతో నిర్మించనున్న రిటైనింగ్ వాల్ నిర్మాణం, తదితర పనులకు ఆమె ప్రారంభించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ జాకీర్ అహ్మద్, మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, కౌన్సిలర్ రాములు, నాయకులు లక్ష్మణ్, సందీప్, దీపు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

కందుకూరు: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ గంగాపురం చెన్నకిషన్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని తిమ్మాపూర్‌లో గంగాపురం వెంకటరాజిరెడ్డి స్మారక ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. దాదాపు 400 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు కందుకూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి, రీజియన్ చైర్మన్ సాధు ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్లుగుప్తా, కోశాధికారి రామస్‌బాబు, మాజీ అధ్యక్షుడు అంజయ్య, బీఆర్ రాంరెడ్డి, చెన్నకిషన్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, పున్న భిక్షపతి, సురేందర్‌రెడ్డి, ఈశ్వర్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, తిరుమలరెడ్డి, ఎస్.సుధాకర్‌రెడ్డి, లచ్చయ్య, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వరుడి సేవకు వేళాయె



ముస్తాబైన కనకమామిడి సంగమేశ్వర దేవాలయం



గర్భగుడిలో స్వామివారు



వేపచెట్టుకు భక్తుల ముడుపులు

23 నుంచి కనకమామిడి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

మొయినాబాద్ రూరల్: ప్రకృతి అందాల నడుమ నిర్మించిన సంగమేశ్వర దేవాలయం భక్తులకు ఆధ్యాత్మికత, ఆహ్లాదాన్ని పంచుతోంది. భక్తుల కోరికలు తీరుస్తూ కొంగు బంగారంగా విరజిల్లుతుంది. జిల్లాలోని మొయినాబాద్ మండలం కనకమామిడి గ్రామ సమీపంలో సంగమేశ్వర దేవాలయం ఉంది. ఈ ఆలయాన్ని 400 ఏళ్ల కిందట నిర్మించారని చరిత్ర చెబుతుంది. ఇక్కడ మూడు వాగులు కొండల మధ్య నుంచి ప్రవహిస్తూ ఏర్పడిన పవిత్ర సంగమంతో శివలింగం దర్శనమివ్వడంతో పూర్వీకులు ఇక్కడ ఆలయాన్ని నిర్మించారని ఆనవాళ్లు తెలుపుతున్నాయి. దాదాపు 6 ఎకరాల స్థలంలో విశాలంగా నిర్మించారు. ఆలయం పక్కనే కోనేరు, తాడిపత్రి చెట్టు ఎకరా స్థలంలో విస్తరించి ఆకర్షణీయంగా దర్శనమిస్తోంది.

ఆలయ విశిష్టత

త్రివేణి సంగమంతో ఏర్పడిన సంగమేశ్వర ఆలయంలో గోధుమ రంగులో ఉన్న శివలింగానికి అనేక మహిమలు ఉన్నాయని స్థానికులు చెబుతుంటారు. అభిషేకాలు చేసే సమయంలో ఈ లింగం కదులుతుందని అంటారు. ఆలయానికి వచ్చే భక్తులు ముడుపులు కట్టి కోరికలు తీరాక స్వామివారిని దర్శించుకుంటారు. మండలంలోని కనకమామిడి సమీపాన గల సంగమేశ్వరుడు భక్తులకు కొంగు బంగారంగా నిలుస్తున్నారు. దీంతో భక్తులు ప్రతి సోమవారం స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో విచ్చేస్తారు. ఇక్కడ సంగమేశ్వరుడి పక్కనే ఉన్న వేపచెట్టుకు ముడుపులు కట్టి వెళతారు. మొక్కుతీరిన తరువాత భక్తులు ఇక్కడికి వచ్చి ప్రత్యేక పూజలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. అలాగే ఆలయ అభివృద్ధికి దోహదపడుతున్నారు.

ఇలా చేరుకోవచ్చు

సంగమేశ్వర దేవాలయానికి జంట నగరాలతో పాటు వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఈ ఆలయానికి హైదరాబాద్ నుంచి పరిగి, వికారాబాద్, కర్ణాటక, గుల్బర్గా, తాండురు తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులు కనకమామిడి చౌరస్తా మీదుగా వెళ్తాయి. మెహదీపట్నం నుంచి చేవెళ్ల, కనకమామిడి, చాకలిగూడ, వెంకటాపూర్ గుడి సమీపం నుంచి వెళ్తుంటాయి, అలాగే ఆలయం వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

కార్యక్రమాలు

దేవాలయంలో ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు సంగమేశ్వర మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారులు తెలిపారు. 23న విఘ్నేశ్వర పూజ, గణపతి హోమం, రుద్రాభిషేకం, ధ్వజారోహనం, అగ్నిగుండాలు, 24న స్వామి వారికి అభిషేకాలు, దివ్య రథోత్సవం, 25న సత్యనారాయణ వ్రతాలు, పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవం, నాటకాలు, భజనలు, 26న మహామంగళ హారతి తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొన్ని ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



ఏబీవీపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్

చేవెళ్ల: ఎన్నో పోరాటాలు, ఉద్యమాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్న విద్యార్థుల సమస్యలు మాత్రం తీరటం లేదని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కళ్లెం సూర్యప్రకాశ్ అన్నారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఏబీవీపీ నగర కార్యదర్శి మహిపాల్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. అనంతరం సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రూ.5,300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే గుర్తించి పరిష్కరించాలన్నారు. ఇప్పటికైనా కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని కోరారు. అనంతరం నిరసన తెలుపుతున్న విద్యార్థి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు హరికృష్ణ, శివ, తరుణ్, విజయ్, శివ, ప్రదీప్, శ్రీనాథ్, పావని, శ్రావ్య, కల్యాణి, కీర్తి, కావ్య, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

గెలుపే లక్ష్యంగా శ్రమించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, చిత్రంలో హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రమించాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కోరారు. మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. దీనికి హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్ తదితర నేతల హాజరైయ్యారు. ఈ సందర్భంగా అంజయ్యయాదవ్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రజలకు అనేక హామీలు ఇచ్చారన్నారు. అధికారం చేపట్టిన వెంటనే వాటిని అమలు చేయడంలో కాంగ్రెస్ చతికిల పడిందన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు వివరించి చైతన్య పరచాలన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అన్ని వర్గాల ప్రజలు ఎంతో పోరాటం చేశారన్నారు. త్యాగాల పునాదుల మీద ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయ్యిందన్నారు. కొట్లాడి సాధించిన రాష్ట్రాన్ని పార్టీ అధినేత కేసీఆర్ బంగారు తెలంగాణగా నిర్మించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు డబ్బులను నేటికీ జమ చేయలేదన్నారు. అసమర్థ ప్రభుత్వానికి ఎన్నికల్లో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బీఆర్ఎస్ నేత మృతి



పాండురంగారావు (ఫైల్)

షాబాద్: మండల పరిధిలోని మన్‌మర్రి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పాండురంగారావు(60) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందారు. పాండురంగారావు మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని స్థానిక నేతలు అన్నారు.

సీఎంకు.. స్వాగత సన్నాహాలు

బొంరాస్‌పేట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలిసారిగా నియోజకవర్గానికి రానున్న నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం పార్టీ నేతలు నర్సింహులుగౌడ్, ఆవుటి శేఖరయ్య మాట్లాడారు. పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు సీఎం రేవంత్.. బుధవారం ఇక్కడికి రానున్నారని తెలిపారు. ఇందులో భాగంగా కోస్గి పట్టణ కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం భారీ బహిరంగసభ ఉంటుందని, సభకు ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

సీఐ సైదిరెడ్డికి సన్మానం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సీఐగా బాధ్యతలు తీసుకున్న సైదిరెడ్డితోపాటు ఎస్ఐ మారయ్యను మంగళవారం కాంగ్రెస్ నేతలు ఘనంగా సన్మానించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని సీఐ కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ సుబ్బురి పాండు, ఏ–బ్లాక్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మల్లిక, నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు శ్యామ్‌సుందర్, పార్టీ నాయకులు ఆనంద్ కిషోర్, రాజు ఉన్నారు.

రోడ్డు అంచున పొంచి ఉన్న ప్రమాదం



జాతీయ రహదారి పక్కనే ప్రమాదకరంగా మారిన మర్రిచెట్టు

చేవెళ్ల: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై ఓ పెద్ద మర్రి చెట్టు ప్రమాదకరంగా మారింది. అది పూర్తిగా ఎండిపోయి రోడ్డు వైపునకు వాలింది. దీంతో నిత్యం ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని మిర్జాగూడ–ఖానాపూర్ బస్‌స్టేజీల మధ్య ఉన్న పెద్ద మర్రి చెట్టు కొన్ని రోజులుగా ఎండిపోయి గాలివాన వచ్చినప్పుడు పడిపోయేందుకు సిద్ధంగా ఉంది. రోడ్డుకు పక్కనే ఉండటంతో గాలి వీచినప్పుడు కొమ్మలు విరిగి పడుతున్నాయి. పక్కనే విద్యుత్ తీగలు ఉండడంతో ప్రమాదం ఎక్కువ ఉండే ఆస్కారం ఉంది. దీనిపై అధికారులు స్థానిక నాయకులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


'బండి'కి కమలనాథుల స్వాగతం

పూడూరు: తాండూరు విజయ సంకల్ప బస్సు యాత్రకు వెళ్తున్న బీజేపీ తెలంగాణ మాజీ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్, కేంద్ర మంత్రి బీఎల్ వర్మ, ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డిలకు పార్టీ మండల శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బండి.. వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ పరిగి ఇన్‌చార్జి బూనేటి మారుతీకిరణ్, సెన్సార్ బోర్డు మెంబర్ మల్లేశ్ పటేల్, పార్టీ మండల అధ్యక్షుడు అనీల్, నాయకులు రాఘవేందర్, మాణిక్యం, రాఘవేందర్ రెడ్డి వెంకటయ్య, రాజు, పాండు తదితరులు పాల్గొన్నారు.



బండి సంజయ్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

విరబూసిన మోదుగు



నరెడ్లగూడలో విరగబూసిన మోదుగుపూత

షాబాద్: మండల పరిధిలోని నరెడ్లగూడ, కక్కులూర్, అస్పల్లిగూడ, నాగరకుంట, గ్రామల సమీపంలో విరగబూసిన మోదుగు పూత దృశ్యాలను 'సాక్షి' మంగళవారం కెమెరాలో బంధించింది. మోదుగుపూత ఎర్రగా పూసి చూపరులను ఆకట్టుకుంటుంది. అడవుల్లో రహదారులకు ఇరువైపులా ఆకులు రాలి మోడువారిన మోదుగు చెట్లకు పూసిన పూలు కనువిందు చేస్తున్నాయి.



ఆకర్షణీయంగా పూలు

ఓవర్‌లోడ్!

సామర్థ్యానికి మించి టిప్పర్లలో ఎర్రమట్టి తరలింపు

- ధ్వంసమవుతున్న రోడ్లు
- పట్టించుకోని అధికారులు
- అడ్డుకుంటే పోలీసుల అభ్యంతరం



జినుగుర్తి రోడ్డుపై ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఎర్రమట్టి టిప్పర్

తాండూరు రూరల్: అధికలోడ్‌తో వెళ్తున్న వాహనాలతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. తాండూరులో అనేక సిమెంట్ కర్మాగారాలు ఉన్నాయి. దీంతో సహజంగానే భారీ వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. అయితే ఈ కంపెనీలకు నిత్యం వందల సంఖ్యలో టిప్పర్లు.. ఎర్రమట్టి (సామర్థ్యానికి మించి లోడుతో)ని జారవేస్తుంటాయి. పైగా టార్పాలిన్లు కప్పకుండానే అవి దూసుకుపోతుండటంతో.. వాటి నుంచి వెలువడిన దుమ్ముతో వెనకాల వచ్చే ఇతర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

తట్టెపల్లి నుంచి..

పెద్దేముల్ మండలం తట్టెపల్లి ప్రాంతాల్లో ఎర్రమట్టి క్వారీలు అతిగా ఉన్నాయి. ఇక్కడి నుంచే మట్టిని టిప్పర్ల ద్వారా తాండూరు మండలం మల్కాపూర్ శివారులోని ఓ సిమెంట్ ఫ్యాక్టరీకి తరలిస్తుంటారు. అయితే ఈ టిప్పర్లు అధిక లోడుతో వేగంగా పరుగులు తీస్తుండటంతో గుండ్ల మడుగు తండా, జినుగుర్తి తండా, జినుగుర్తి ప్రజలు భయందోళన చెందుతున్నారు. వాయు వేగంతో దూసుకెళ్తుండటంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని వాపోతున్నారు. గతంలో ఓ ఎర్రమట్టి లారీ ఢీకొనడంతో.. పదుల సంఖ్యలో ఆవులు మృత్యువాత పడ్డాయని తెలిపారు.

అడిగేనాథుడే లేడు...

అధిక లోడుతో టిప్పర్లు పరుగులు పెడుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని పరిసర ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. టిప్పర్ల నిండా మట్టిని నింపుకోవటమే కాకుండా.. కనీసం దానిపై టార్పాలిన్ కవర్లను కప్పరని, దీంతో వెనకాల వస్తున్న వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. అధిక లోడుతో వెళ్తున్న వాహనాలను స్థానిక యువకులు అడ్డుకుంటే.. పోలీసులతో ఆ యువకులను మట్టి వ్యాపారులు భయాందోళనకు గురి చేయిస్తుంటారని పేర్కొన్నారు. అడ్డుకోవలసిన పోలీసులే.. ప్రజలు అడ్డుకుంటే అభ్యంతరం తెలపడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీఏ, పోలీసులు స్పందించి, ఓవర్ లోడుతో వెళ్తున్న లారీలను అరికట్టాలని బాధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోరు..



నిత్యం మా తండా నుంచి పదుల సంఖ్యలో ఎర్రమట్టి లోడ్‌తో లారీలు వెళ్తుంటాయి. అతివేగంగా, అజాగ్రత్తగా దూసుకుపోతుంటాయి. ఉదయం, సాయంత్రం పాఠశాల సమయంలో విద్యార్థులు రోడ్డు దాటాలంటే భయపడుతున్నారు. పోలీసులకు చెప్పినా పట్టించుకోవటం లేదు.

– శంకర్, తండావాసి, గుండ్లమడుగుతండా

యువతరానికి మంచి భవిష్యత్



హైమాస్ట్ లైట్లు అందజేస్తున్న మారుతి కిరణ్

కుల్కచర్ల: యువతకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, భవిష్యత్ భారతం యువతరానిదేనని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ అన్నారు. మండల పరిధి ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన యువకులకు వాలీబాల్ కోర్టులో ఏర్పాటు చేసుకునేందుకు హైమాస్ట్ లైట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత వ్యసనాలకు బానిస కావొద్దన్నారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో పాల్గొని ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఆసక్తి గల క్రీడల్లో నైపుణ్యం పెంచుకునేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మైపాల్, ఇప్పాయిపల్లి–రాంపూర్ యువకులు తదితరులు పాల్గొన్నారు.